## క్లుప్తంగా

### అర్హులకు రేషన్‌కార్డులు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి

**గంట్యాడ:** అర్హులందరికీ రైస్‌కార్డులు అందజేయాలని తహసీల్దార్ పి. నీలకంఠేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైస్ కార్డుల్లో చేర్పులు, మార్పులతో పాటు కొత్త రైస్‌కార్డుల కోసం దరఖాస్తు ఆహ్వానించాలన్నారు. వీలైనంత త్వరలో అర్హులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సీఎస్‌డీటీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### డీఈఓ కార్యాలయం ముట్టడి రేపు



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

**దత్తిరాజేరు:** ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, తదితర డిమాండ్లపై ఈనెల 21న డీఈఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయ సంఘ నాయకులు రామ్‌ప్రసాద్, హరీష్, సత్యనారాయణ, పరుశురాం, గురునాయుడు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలపై చిన్న చూపు చూస్తుందని ఆరోపించారు. యూటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి ఉపాధ్యాయుడూ పాల్గొనాలని కోరారు.

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తునన ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు

**శృంగవరపుకోట:** పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ.. జూన్ 6న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మూడవ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు జరగనున్న నేపథ్యంలో చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎస్.కోట తాలూకా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, దేవేంద్ర, గౌతమి, శివశంకర్ పాల్గొన్నారు.

### ప్రసవాల సంఖ్య పెంచాలి



రికార్డులో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

**గంట్యాడ:** పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌ఓ జీవనరాణి తెలిపారు. గంట్యాడ పీహెచ్‌సీనిసోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. హైరిస్క్ గర్భిణులను ముందుగా ఆస్పత్రిలో చేర్పించాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యుడు తప్పనిసరిగా పాల్గొనాలని స్పష్టం చేశారు.

### మహిళలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

**లక్కవరపుకోట:** మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని, ఈ విషయంలో వారికి కావాల్సిన సహాయ సహకారాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం ఆవరణలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఈ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎల్.కోట సర్పంచ్ కెర్రు పార్వతి, మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్మన్ సీహెచ్.మల్లునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

- అద్దె ప్రాతిపదికన దుకాణాల కేటాయింపు
- అయినా కొంతమంది పాత దుకాణాల్లోనే వ్యాపారం
- బేరాల్లేక ఇబ్బంది పడుతున్న రైతులు
- మరుగుదొడ్లకు తాళాలు




గజపతినగరం మార్కెట్

# మార్కెట్‌యార్డులో.. సౌకర్యాలు కరువు



ఖాళీగా ఉన్న షాపులు



బేరాల్లేక వెలవెలబోతున్న కొత్త షాపులు

**గజపతినగరం రూరల్:** గజపతినగరం మార్కెట్ యార్డులో కొత్త దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారులకు కేటాయించినా బేరాల్లేక ఇబ్బంది పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో వినియోగదారులు కూడా కొనుగోలుకు ముందుకు రావడం లేదు. వాస్తవానికి ఈ ప్రాంతంలో సుమారు 50 రైతు కుటుంబాలు కూరగాయలు విక్రయించుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నాయి. అయితే ఇటీవల స్థానిక గజపతినగరం పంచాయతీ అధికారులు శాశ్వత మార్కెట్ షెడ్‌లను ఏర్పాటు చేసి 32 షాపులను వ్యాపారులకు కేటాయించారు. ఇందులో పది కూరగాయల షాపులు, కిరాణా దుకాణాలు రెండు, మూడింటిలో ఉల్లిపాయలు, మరో మూడింటిలో చేపల విక్రయాలు, టైలర్లు మూడు దుకాణాల్లో ఉంటుండగా.. మిగతావి ఖాళీగా ఉన్నాయి. ఈ దుకాణాలకు సంబంధించి ఒక్కొక్కరి నుంచి రూ. ఐదు వేల డిపాజిట్‌తో పాటు వెయ్యి రూపాయల అద్దె వసూలు చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇందులో కేవలం పది మంది మాత్రమే షాపులు తెరుస్తున్నారు. మిగిలిన వారంతా పాత దుకాణాల్లోనే వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. దీంతో వినియోగదారులు కొత్త దుకాణాల వద్దకు రావడం లేదు. మార్కెట్ ప్రారంభంలో ఉన్న పాత దుకాణాల వద్దే వినియోగదారులు ఉండిపోతున్నారని, దీంతో తమకు బేరాలు ఉండడం లేదని కొత్త దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తాళం వేసి ఉన్న మరుగుదొడ్డి

#### కానరాని సౌకర్యాలు

వేలల్లో డిపాజిట్లు, ప్రతి నెలా అద్దె తీసుకుంటున్న పంచాయతీ అధికారులు సంబంధిత వ్యాపారులకు సౌకర్యాలు కల్పించడంలో శతశాతం విఫలమయ్యారు. మార్కెట్ యార్డులో కనీస అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు లేవు. కనీసం ధరల పట్టిక కూడా ఏర్పాటు చేయలేదు. అలాగే మార్కెట్ చుట్టూ చెత్తాచెదారాలతో పేరుకుపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

#### బేరాల్లేవు..

అధికారులు మాకు కొత్తగా దుకాణాలు కేటాయించారు. అయితే చాలా మంది మార్కెట్ యార్డు ప్రారంభంలో ఉన్న పాత దుకాణాల్లోనే వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో వినియోగదారులెవ్వరూ మా వద్దకు రావడం లేదు. దీంతో బేరాల్లేక ఇబ్బంది పడుతున్నాం.

– గడ్డెమ్మ, కూరగాయల వ్యాపారి

#### అధికారులది పక్షపాత వైఖరి..

అధికారులు పక్షపాతవైఖరి చూపిస్తున్నారు. మాకు షాపులు కేటాయించి మా వద్ద అద్దె వేలల్లో తీసుకుని పాత షాపుల్లో కొంతమంది వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా పాత షాపులను రద్దుచేయడం లేదు. దీనికి తోడు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేదు.

– కందుల తాతాజీ, వ్యాపారి

#### పాత దుకాణాలను రద్దు చేస్తాం..

నూతన మార్కెట్ యార్డులో 32 షాపులు అద్దెకిచ్చాం. ఇంకా కొంతమంది పాత షాపుల్లో వ్యాపారాలు చేపడుతున్నారు. త్వరలోనే వాటిని ఖాళీ చేయిస్తాం. అలాగే మార్కెట్ యార్డులో మౌలిక వసతులు కల్పిస్తాం.

– జనార్దనరావు కార్యదర్శి, గజపతినగరం

## పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులు..



ఎస్.కోట: సీపీఎం జెండాను ఆవిష్కరించిన పార్టీ మండల కార్యదర్శి మద్దిల రమణ



వేపాడ: సుందరయ్య చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

**శృంగవరపుకోట:** మండలంలోని కొత్తూరులో పుచ్చలపల్లి సుందరయ్య 40 వర్ధంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1913 మే 1న జన్మించిన సుందరయ్య బాల్యం నుంచే అన్యాయాలను ఎదురించేవారన్నారు. సామాజిక అసమానతలను సహించేవారు కాదని చెప్పారు. భూమిలేని పేదలకు భూములు పంచాలని.. కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎన్నో పోరాటాలు చేశారన్నారు. నేడు ఆయన మనమధ్య లేకపోయినా ఆయన పోరాట పటిమ స్ఫూర్తితో మన సమస్యలను పరిష్కరించుకుంటున్నామన్నారు.

#### సుందరయ్య జీవితం ఆదర్శప్రాయం

**కొత్తవలస:** మాజీ ఎంపీ, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శప్రాయమని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు గాడి అప్పారావు అన్నారు. సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని దెందేరు గ్రామంలో ఉపాధి వేతనదారుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్మిక సంఘ నాయకుడు అప్పారావు మాట్లాడుతూ..పుచ్చలపల్లి నిరాడంబర జీవితం సాగించారని తెలిపారు. ఆయన ఆస్తులను పేదలకు పంచిపెట్టారని కొనియాడారు. ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లి పలువురికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు.

#### స్ఫూర్తిని కొనసాగిద్దాం..

**వేపాడ:** కమ్యూనిస్టు పార్టీ ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తిని కొనసాగిద్దామని సీపీఎం నాయకుడు చల్లా జగన్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. సుందరయ్య జీవితం త్యాగాల మయమన్నారు. ఆయన వ్యక్తిత్వం, అంకితభావాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా పైడితల్లి తొలేళ్లు.

- ఆకట్టుకున్న ప్రభలు



ఆకట్టుకున్న ప్రభలు

**వేపాడ:** మండలంలోని వల్లంపూడిలో గ్రామదేవత పైడితల్లి జాతర సందర్భంగా సోమవారం తొలేళ్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రభలు ఆకట్టుకున్నాయి. క్రేన్ సహాయంతో ప్రభలను కొలువుదీర్చారు. అనంతరం తొలేళ్ల సందర్భంగా భక్తులు ఊరేగితూ అమ్మవారి పాటలు పాడారు. మంగళవారం అనుపోత్సవం నిర్వహించనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

## కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఏకగ్రీవం

**కొత్తవలస:** మండల ప్రజాపరిషత్ కో ఆప్షన్ సభ్యుడి ఎన్నిక ప్రిసైడింగ్ అధికారి ఎం.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించగా... వైఎస్సార్‌సీపీ బలపరిచిన షేక్ చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిన్నారావు పేరును వైస్ ఎంపీపీ కర్రి శ్రీనివాసరావు ప్రతిపాదించగా.. ఎంపీటీసీ సభ్యుడు లెంక వరహాలు బలపరిచారు. మండలంలోని 20 మంది ఎంపీటీసీ సభ్యులుండగా.. ఈ ఎన్నికకు 15 మంది హాజరయ్యారు. ఒక్క నామినేషనే దాఖలు కావడంతో చిన్నారావు ఎన్నిక ఏకగ్రీవమైంది. అనంతరం చిన్నారావును ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ఎస్.రమణయ్య, నీలం అప్పారావు, పలు గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



చిన్నారావుని సన్మానిస్తున్న ఎంపీపీ ఎన్.గోపమ్మ, ఎంపీటీసీ సభ్యులు

## • ఉప సర్పంచ్‌గా సూర్యం..



నియామక పత్రం అందుకుంటున్న సూర్యం

**చీపురుపల్లి రూరల్ (గరివిడి):** గరివిడి మండలంలోని శేరీపేట పంచాయతీ ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీకి చెందిన పొట్నూరు సూర్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతవరకు ఉప సర్పంచ్‌గా ఉన్న వ్యక్తి జెంటిల్‌మన్ ఒప్పందం ప్రకారం రాజీనామా చేయగా.. ఆయన స్థానంలో సూర్యంను ఎనున్నకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్ల రామయ్యమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యడ్ల అప్పారావు, స్థానిక నాయకులు పిల్ల ఆదినారాయణ, జమ్ము కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

#### జాబ్‌మేళా రేపు

**మెరకముడిదాం:** మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ వారు ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నారని పరిశ్రమ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న జాబ్‌మేళాకు 60 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 20 సంవత్సరాల్లోపున్న వారు మాత్రమే హాజరుకావాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకురావాలని కోరారు.

#### శ్యామలాంబ జాతరకు ప్రత్యేక బస్సులు

**శృంగవరపుకోట:** సాలూరు శ్యామలాంబ జాతర సందర్భంగా ఎస్.కోట డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18, 19 తేదీల్లో ఐదు బస్సులు నడిపినట్లు చెప్పారు. అలాగే 20, 21 తేదీల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రోజుకు 15 బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

#### న్యాయం చేయండి

**చీపురుపల్లి రూరల్ (గరివిడి):** రైల్వే స్థలంలో ఉన్న దుకాణాలను తొలగించాలని రైల్వే అధికారులు నోటీసులు జారీ చేశారని.. ఎన్నో ఏళ్లుగా ఉంటూ జీవనం సాగిస్తున్న తమకు న్యాయం చేయాలని వ్యాపారులు కోరారు. ఈమేరకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావులను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గరివిడి రైల్వే స్థలంలో ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్నామని, సదరు స్థలాలకు అద్దె కూడా చెల్లిస్తున్నామని వ్యాపారులు తెలిపారు. పది రోజుల్లో దుకాణాలు తొలగించమంటే కుటుంబాలు రోడ్డున పడతాయని, తమను ఆదుకోవాలని కోరారు.

#### రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

**చీపురుపల్లి:** పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ కోఆర్డినేటర్ బీవీ గోవిందరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రక్తనిల్వల కొరతను నివారించేందుకు గాను శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత రక్తదానానికి ముందుకు రావాలని కోరారు.

#### ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి

**వేపాడ:** ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన పలు మాదిగ కుటుంబాలు కోరాయి. ఈ మేరకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గ్రామ అధ్యక్షుడు మూనూరు జయరాజు, కార్యదర్శి తిరుపతి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు, తిరుపతి మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 105/2లో మెట్ట పోరంబోకు స్థలం ఉందని.. ఆ స్థలాన్ని పేద కుటుంబాలకు కేటాయించాలని కోరారు.

#### నీటి తీరువా వసూలు వేగవంతం

**బొండపల్లి:** గ్రామాల్లో నీటి తీరువా వసూళ్లను వీఆర్‌ఓలు వేగవంతం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో కూడా నీటి తీరువా వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలని చెప్పారు. అలాగే గ్రామాల్లో రైతుల సమక్షంలో సమగ్ర భూ రీసర్వే చేపట్టి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

#### మద్యం మత్తులో డ్రైవింగ్ చేయరాదు

**బొండపల్లి:** మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై యు.మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన తనిఖీల్లో ఎవరైనా పట్టుబడితే రూ. పది వేల జరిమాన తప్పదని పేర్కొన్నారు. అలాగే మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. భారీ వాహనాలతో పాటు కార్లు పార్కింగ్ చేసినప్పుడు తప్పనిసరిగా లాక్ చేయాలని తెలిపారు.

#### రైతులకు న్యాయం చేయండి..

**బొండపల్లి:** హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ వేసేందుకు గాను భూములు కోల్పోతున్న రైతులకు ముందు న్యాయం చేసిన తర్వాతే పనులు ప్రారంభించాలని సీపీఐ జిలా నాయకుడు పురం అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి వల్ల వేలాది ఎకరాలు కోల్పోయిన రైతులు... తాజాగా పైప్‌లైన్ ఏర్పాటుతో మరింత భూములు కోల్పోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ భూములు సేకరిస్తే రైతులకు ఇబ్బంది ఉండదని, ఈ దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో భూములను సేకరించాల్సి వస్తే రైతులకు అన్ని విధాలుగా న్యాయం చేసిన తర్వాతనే ముందుకు సాగాలన్నారు.

## దళితులపై దాడులు పెరిగాయ్..



**టీ**డీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయని నియోజకవర్గ దళిత సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. తిరుపతిలో బీటెక్ విద్యార్థిపై దాడి చేసిన అగ్రకులాల వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు టి.సంజీవరావు, ఆర్.రామకృష్ణ, బి.సూర్యనారాయణ, బి.పోలీసు, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు. – చీపురుపల్లి

## ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



**గు**ర్ల మండలంలోని కోటగండ్రేడులో వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా వేంకటేశ్వర ఉత్సవ విగ్రహాలను కోటగండ్రేడు, గుర్ల, కలవచర్ల, గోషాడ గ్రామాల్లో సోమవారం ఊరేగించారు. భక్తులు విగ్రహాలను దర్శించుకున్నారు. ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని భువనేశ్వరి ఆలయ పీఠం కమిటీ సభ్యురాలు రమాదేవి తెలిపారు. – గుర్ల

## కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం



మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు

**దత్తిరాజేరు:** తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు ఆరోపించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలందరినీ మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుల పనులు చేయొద్దని టీడీపీ నాయకులు అధికారులను బెదిరిస్తున్నారని వాపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి ధోరణి లేకుండా, అన్ని వర్గాల వారికీ న్యాయం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, పార్టీ నాయకులు మహదేవ్ ఫణీంద్రుడు, సిరిపురపు శంకరరావు పాల్గొన్నారు.

## భూ సేకరణ జీఓను రద్దు చేయాలి

**వేపాడ:** మండలంలోని కరకవలస పంచాయతీ గిరిశిఖర గ్రామమైన మారికలో భూసేకరణ సామాజిక అధ్యయనంకు సంబంధించి విడుదల చేసిన జీఓను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, తదితరులు కోరారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సన్యాసినాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్, తదితరులు మాట్లాడుతూ.. ఏప్రిల్ 24న కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారన్నారు. సమాజిక అధ్యయనం పేరుతో భూ సర్వే చేపట్టి ప్రైవేట్ కంపెనీలకు భూములు ధారదత్తం చేయడానికి ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. మారిక రెవెన్యూలో జిరాయితీ భూములు 213.8 ఎకరాలతో పాటు అటవీ హక్కుల పొందిన పట్టా భూముల్లో గిరిజనులు పంటలు పండించుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని చెప్పారు. గ్రామస్తుల భూములను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెడితే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, పోరాట కమిటీ నాయకులు జలారి వీర్రాజు, అప్పలనాయుడు, శ్రీను, అర్జున్, ఆసు, బుజ్జిబాబు, దేవుడు, శోభన్‌బాబు, రమేష్, దేముడు, తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు, గిరిజనులు

### అవగాహన..

**లక్కవరపుకోట:** బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం స్థానిక సచివాలయం వద్ద వైద్యుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల దాంపత్య జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అలాగే చిన్న వయస్సులో గర్భం దాల్చడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కెర్రు పార్వతి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యుడు అనిల్‌కుమార్